ఉపాధి కూలీల ఆకలి కేకలు

- కూలీల ఖాతాలకు జమకాని వేతనాలు
- రెండు నెలలుగా కూలీల ఎదురు చూపులు


కోడుమూరులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కోడుమూరు రూరల్: వారంతా రెక్కాడితేగానీ పూట గడవని కూలీలు. కరువుతో చేసేందుకు పనుల్లేక ఉపాధి పథకం కిందనైనా పనులు చేసి పొట్టపోసుకుందామని వస్తే తీరా పనులు చేసిన తర్వాత వేతనాలు సకాలంలో మంజూరు కాని పరిస్థితి. చేసిన పనులకు సంబంధించిన బిల్లులన్నీ రెండు నెలలకు పైగా పెండింగ్‌లో ఉండిపోవడంతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి కూలి డబ్బులు మంజూరుకాకపోతే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలంటూ తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పనులకు సంబంధించిన బిల్లులన్నీ ఉపాధి సిబ్బంది ప్రభుత్వానికి పంపినప్పటికీ, ప్రభుత్వం మాత్రం కూలీలకు సంబంధించిన వేతనాలను వారి ఖాతాల్లో జమ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

దీంతో ఉపాధి కూలీలు వేతనాల కోసం పడిగాపులు కాస్తున్నారు. కొందరు కూలీలు డబ్బులు రాకపోవడంతో ఇతర పనుల్లోకి వెళ్లి జీవనం గడుపుతుండగా, మరికొందరు రేపు మాపు అంటూ అధికారులు చెబుతున్న మాటలు వింటూ అలాగే పనుల్లోకి వస్తున్నారు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



వ్యవసాయ పనులు లేకపోవడంతో బయట చేసేందుకు పనుల్లేక ఉపాధి పనుల్లోకి వస్తున్నా. రెండు నెలల నుంచి చేసిన పనులకు సంబంధించిన వేతనాలు మంజూరుగాకపోవడంతో కుటుంబాన్ని పోషించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కూలి డబ్బుల కోసం అధికారులను అడిగితే బిల్లులన్నీ ప్రభుత్వానికి పంపాం, త్వరలో మంజూరవుతాయని చెబుతున్నారే తప్రా డబ్బులు మాత్రం వేయడం లేదు. – లక్ష్మీదేవి, ఉపాధి కూలీ

వేతనాలందక ఇబ్బందులు

కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల్లోని గ్రామాల్లో 5668 గ్రూపుల కింద 14458 మందికి పైగా కూలీలు ఉపాధి పథకం కింద పనులు చేస్తున్నారు. వీరిలో ఒక్కొక్కరికి 8 నుంచి 9 వారాలకు బిల్లులకు పెండింగ్‌లో ఉన్నాయి. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలన్నింటినీ త్వరగా తమ ఖాతాలకు జమయ్యేలా చూడాలని ఉపాధి కూలీలు ముక్త కంఠంతో కోరుతున్నారు.

ప్రభుత్వానికి బిల్లులు పంపాం

గత రెండు నెలలుగా ఉపాధి కూలీలకు సంబంధించిన వేతనాలు మంజూరు కాలేదు. కూలీలు చేసిన పనులకు సంబంధించిన బిల్లులన్నీ ప్రభుత్వానికి పంపడం జరిగింది. కూలీల వేతనాలు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. త్వరలో బిల్లులన్నీ మంజూరవుతాయి.
– మోదీన్‌బాషా, ఏపీఓ, కోడుమూరు

రెండు నెలలుగా వేతనాలందలేదు



రెండు నెలల నుంచి చేసిన పనులకు సంబంధించిన కూలీ డబ్బులు రాలేదు. ప్రతి రోజు పనిలోకి వెళితే గాని పూట గడవని పరిస్థితి మాది. వేతనాల మంజూరు గురించి అధికారులను అడిగితే మీ ఖాతాలకే జమ అవుతాయని చెబుతున్నారే తప్పా వేతనాలు మాత్రం మంజూరు కావడం లేదు. ఏమి చేయాలో పాలుపోవడం లేదు. – రహిమాబీ, ఉపాధి కూలీ

15న మండల సర్వసభ్య సమావేశం

ఓర్వకల్లు: మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశానికి ఆయా శాఖల మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరుకావాల్సిందిగా కోరారు.

త్వరలో చెరువుల అభివృద్ధి పనులు

పాణ్యం: మండలంలోని చెరువుల అభివృద్ధి పనులు త్వరలో చేపట్టనున్నట్లు మైనర్ ఇరిగేషన్ డీఈఈ నాగన్న అన్నారు. ఆయన మంగళవారం మండలంలోని చెరువులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మొత్తం ఆరు చెరువులకుగాను అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.2.10 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. వీటికి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ప్రధానంగా నీటి నిల్వ కోసం పూడికతీత, లీకేజీలను అరికట్టడం, లాక్‌లకు మరమ్మతులు, బండ్‌పై జంగిల్ క్లియరెన్స్ తదితర పనులపై ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. వీటికి అనుమతులు రాగానే పనులు చేస్తామన్నారు. అలాగే కొండజుటూరు, పాణ్యం ఊరుముందరి చెరువు, కొచ్చెరువులను పరిశీలించారు.

క్లుప్తంగా

బోధనా నైపుణ్యం పెంచుకోవాలి


విద్యార్థులతో డీఈఓ జనార్ధన్ రెడ్డి

పాణ్యం: ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకోవాలని డీఈఓ జనార్ధన్‌రెడ్డి సూచించారు. ఆయన మంగళవారం తొగర్చేడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. వార్షిక ప్రణాళిక, తరగతి ప్రణాళిక, పీరియడ్ ప్రణాళిక, విద్యార్థుల వర్క్ బుక్స్, నోట్ బుక్ కరెక్షన్, విద్యార్థుల సామర్థ్యాలు తనిఖీ చేయడం జరిగిందన్నారు. అలాగే ఐదవ తరగతి విద్యార్థులకు అందించిన అబాకర్స్‌తో గణితం ఎలా సాధన చేయాలనే విషయంపై ఆరా తీశారు. విద్యార్థుల సామర్థ్యాలను నిత్యం గమనించి అంచనా వేయాలన్నారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు సమయపాలన తదితర వాటిపై ఆరా తీశారు. ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం, హెచ్‌ఎం సాంబశివుడు, అరుణ్‌కుమార్ నాయక్, యూనస్ బాష, మాధవరెడ్డి, ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

కల్లూరు: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు కె.సుధాకరప్ప, ఆర్.నరసింహులు డిమాండ్ చేశారు. మంగళవారం కల్లూరులోని సూర్యనారాయణ భవన్‌లో శరీన్‌నగర్ మట్టి పని కార్మికుల సమావేశం యేసు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని మరిచి పాత చట్టాలను మార్పు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం వల్ల కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నాయన్నారు. ఏప్రిల్ 12, 13, 14 తేదీల్లో సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు కర్నూలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో వెంకటరాముడు, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ఈశ్వరమ్మ, సరోజమ్మ, మరియమ్మ, ఎల్లమ్మ, సోమేశ్వరి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కర్నూలు(రూరల్): నగర శివారులోని వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పలువురు అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కుల తీర్చుకున్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి


క్షేత్ర ప్రదర్శన నిర్వహిస్తున్న వ్యవసాయాధికారి సుధాకర్

ఓర్వకల్లు: ప్రభుత్వం అందజేస్తున్న వ్యవసాయ సంక్షేమ పథకాలకు రైతులు తమ వద్ద ఉన్న వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏఓ సుధాకర్ తెలిపారు. మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో మంగళవారం ×పొలం పిలుస్తోంది× కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటివరకు 5871 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు చెప్పారు. మిగతావారు సమీపంలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. దీని వల్ల భవిష్యత్‌లో ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ అనుబంధ శాఖల సబ్సిడీ పథకాలను పొందవచ్చన్నారు. ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయించడం జరిగిందన్నారు. అనంతరం కొర్ర పంటలో క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. ఏఈఓ భాస్కర్, వీహెచ్‌ఏ నగేష్, రైతులు పాల్గొన్నారు.

సాగులో యాంత్రీకరణ పెరగాలి


సి.బెళగల్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: పంటల సాగులో యంత్రీకరణ పెరగాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం సి.బెళగల్‌లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ యాంత్రీకరణపై రైతులకు అవగాహన కల్పించారు. సబ్సిడీ ద్వారా రైతులు అవసరమైన యంత్రాలు, పరికరాలు పొందాలన్నారు. సాగులో యాంత్రీకరణ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ పనులను సులభంగా చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ హిమబిందు, వీఏఏ ఆసిఫ్, ఎంపీఈఓలు వెంకటేష్, సునంద తదితరులు ఉన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి


రైతు సభ్యత్వ నమోదు చేస్తున్న దృశ్యం

కల్లూరు: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. మంగళవారం చిన్నటేకూరులో రైతు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి వెన్నుముక రైతు, వ్యవసాయమే అన్నారు. రైతులు సంతోషంగా ఉండాలంటే పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, రుణామాఫీ చేయాలన్నారు. వాతావరణ మార్పుల వల్ల పంటల దిగుబడులు అంతంత మాత్రమే ఉన్నాయన్నారు. పంట దిగుబడులను అమ్ముదామంటే మద్దతు ధరకు కొనే నాథుడే లేడన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు బ్యాంకు రుణాలు, వడ్డీ చెల్లించాలంటే తలకు మించిన భారం అవుతుందన్నారు. బ్యాంకు అధికారులు రుణాలను రెన్యూవల్ చేయాలన్నారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, నాయకులు పుల్లన్న, మహమ్మద్ బాష, గోపాలు, మహిళా రైతులు తదతరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


పెసరవాయి గ్రామంలో పికెట్‌ను తనిఖీ చేస్తున్న నంద్యాల ఏఎస్పీ జావలి

గడివేముల: పచ్చని గ్రామాల్లో గొడవలు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ మంద జావలి హెచ్చరించారు. మండల పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామమైన పెసరవాయిలోని పికెట్‌ను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామంలోని పరిస్థితులపై సిబ్బందిని అడిగి తెలుసుకుని నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు గ్రామంలోకి వస్తే వారిపై నిఘా ఉంచాలన్నారు. గ్రామంలో అల్లర్లు గొడవలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఏదైనా అనుకోని సంఘటన జరిగినప్పుడు తనకు సమాచారం అందించాలన్నారు. గ్రామంలో ఫుట్ పెట్రోలింగ్ చేస్తూ పరిస్థితులను అంచనా వేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.


పోలకల్‌లో పుష్పరథంపై చెన్న సోమేశ్వరుడిని ఊరేగిస్తున్న దృశ్యం

పోలకల్‌లో ముగిసిన పుష్ప రథోత్సవాలు

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో శ్రీ చెన్నసోమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన పుష్పరథోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఆలయం నుంచి గంగాదేవి, పార్వతీదేవి సమేత శ్రీ చెన్నసోమేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పుష్పరథంపై మేళతాళాలతో ఘనంగా ఊరేగించారు. మంగళవారం తెల్లవారుజామున నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నేటి నుంచి రెండురోజుల పాటు ప్రభోత్సవాలు జరుగుతాయి. ప్రభోత్సవంలో ఆది దంపతులు పార్వతి, చెన్న సోమేశ్వరుడు ఊరేగనున్నారు.

'యువత పోరు'ను జయప్రదం చేయండి


ఓర్వకల్లులో పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, పాణ్యంలో..

ఓర్వకల్లు: వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నంద్యాలలో 'యువత పోరు' పేరుతో చేపట్టే ఉద్యమానికి భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జీకే వెంగన్న పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం ఓర్వకల్లులో మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను నయవంచనకు గురిచేసిందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, యువతకు ఉద్యోగాలు లేదా నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరుతూ చేపట్టే యువత పోరు కార్యక్రమానికి ప్రజలు, రైతులు, నిరుద్యోగులు, ప్రజా సంఘాల నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. ఎంపీపీ తిప్పన్న, ఎంపీటీసీ పుల్లయ్య, నాగతిరుపాలు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు శరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడలు వంచుదాం

పాణ్యం: కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా విద్యా వ్యవస్థకు తూట్లు పొడుస్తోందని, దీంతో పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివే పరిస్థితి లేదని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో 'వైఎస్సార్‌సీపీ యువత పోరు' పోస్టర్లను విడుదల చేశారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. హామీల అమలుపై ప్రభుత్వ మెడలు వంచేందుకు బుధవారం నిర్వహించే 'యువత పోరు' కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, నిరుద్యోగులు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు నంద్యాలలోని ఉదయానంద హోటల్ వద్దకు చేరుకుని అక్కడినుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం అందించనున్నట్లు తెలిపారు. నాయకులు మండలాధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా, సుమంత్ రెడ్డి, జాకీర్‌హుసేన్, చందమామ బాబు, బాబి, జగన్, మధురెడ్డి, కంది ప్రసాద్, రోషన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌తో ప్రభుత్వం చెలగాటం


గడివేముల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో యువత పోరు పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

గడివేముల: కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువత, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతూ ఇబ్బందులకు గురిచేస్తోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంతల మధుసూదన గుప్తా మండిపడ్డారు. గడివేముల పార్టీ కార్యాలయంలో ఆయన మంగళవారం మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో గొప్పగా ఎదగాలనే లక్ష్యంతో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తెచ్చారన్నారు. ఈ పథకాన్ని గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరింత పటిష్టంగా అమలు చేశారని చెప్పారు. అయితే కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుపై తొమ్మిది నెలల్లోనే చేతులెత్తేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విఫలమైందని, నిరుద్యోగ భృతి ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యలపై బుధవారం నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన యువత పోరు కార్యక్రమాన్ని యువకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ వంగాల మహేశ్వర రెడ్డి, ఉప సర్పంచ్ బాలచెన్ని, నాయకులు వెంకటేశ్వర్లు, చంద్రమౌళీశ్వర్ రెడ్డి, గోదా ప్రసాద్, వెంకటేష్, బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉల్చాలలో పది పరీక్ష కేంద్రం ఏర్పాటు

కర్నూలు (రూరల్): మండల పరిధిలోని ఉల్చాల గ్రామంలో తొలిసారిగా పదవతరగతి పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో ఈ నెల 17 నుంచి ఉల్చాలతో పాటు రేమట, నిడ్జూరు, జి.సింగవరం పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు డిప్యూటీ డీఈఓ హనుమంతురావు తెలిపారు. ఉల్చాలలో కేంద్రం ఏర్పాటు ద్వారా సమీప గ్రామాల పదోతరగతి విద్యార్థులు కర్నూలు నగరానికి వచ్చి పరీక్ష రాసే అవస్థ తప్పిందని ఎంపీపీ డి .వెంకటేశ్వరమ్మ తెలిపారు. మంగళవారం ఆమె డిప్యూటీ డీఈఓతో సమావేశమై కృతజ్ఞతలు తెలిపారు.

14 నుంచి ఉరుసు


కాల్వ గ్రామంలోని దర్గా

ఓర్వకల్లు: మండలంలోని కాల్వ గ్రామంలో ఈ నెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఉరుసు మహోత్సవాలు నిర్వహించనున్నట్లు పీఠాధిపతులు సయ్యద్ షహబుద్దీన్ షా ఖాద్రి, సయ్యద్ ఖమర్‌షా ఖాద్రి మంగళవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. గ్రామంలో వెలసిన హజరత్ సయ్యద్ మహ్మద్‌షా ఖాద్రి, హజరత్ సయ్యద్ మహ్మద్ గౌస్ మొహియ్యద్దీన్ షా ఖాద్రి ఉరుసు సందర్భంగా 14న రాత్రి 10 గంటలకు మౌలాలి స్వామి ఆశ్రమం నుంచి పూల చాందిని, గంధంను సాధుజన భక్తబృందంతో మేళతాళాలతో స్వాముల వారి దర్గాకు చేర్చి స్వాముల వారి సమాధికి సమర్పించబడుతుందని తెలిపారు. అలాగే 15న సాయంత్రం జెండాలు సమర్పించి, రాత్రి 10 గంటలకు బెంగళూరు, గోవా వారిచే ఖవ్వాలి (పాటల కచేరి) నిర్వహించబడుతుందన్నారు. 16న ఉదయం జియారత్ పూజలు, సాయంత్రం కిస్తీలు ఉంటాయని తెలిపారు.

16న బండలాగుడు పోటీలు

మండలంలోని కాల్వ గ్రామంలో ఈ నెల 16 తేదీన వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు షాబుద్దీన్ షా ఖాద్రి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హజరత్ సయ్యద్ మహ్మద్‌షా ఖాద్రి ఉరుసు సందర్భంగా నిర్వహించే పాల పళ్ల ఎద్దుల విభాగం పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు మొదటి ఆరు స్థానాలకు వరుసగా రూ.70 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వృషభాల యజమానులు అదే రోజు ఉదయం 9 గంటల్లోగా రూ.700 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 81214 81786, 94409 84958 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మత సామరస్యానికి ప్రతీక ఒండుట్ల తిరునాల


బండరాయి కింద కొలువైన రంగస్వామి ఆలయం,(ఇన్‌సెట్) రంగస్వామి మూలవిరాట్, తిరునాలకు ముస్తాబవుతన్న రంగల్ దర్వేశి ఖాద్రీ దర్గా

- 13 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- భక్తుల కోర్కెలు తీర్చే లక్ష్మీరంగస్వామి, రంగల్ దర్వేశిఖాద్రీ

గడివేముల: మతసామరస్యానికి మారు పేరు ఒండుట్ల తిరునాల. గ్రామ సమీప కొండపై హిందూ దేవుడు లక్ష్మీరంగస్వామి. కొండ కింద ముస్లిం దేవుడు రంగల్ దర్వేశి ఖాద్రీ కొలువైన గ్రామం ఒండుట్ల. రెండు మతాల దేవుళ్ల ఉత్సవాలు ఏటా ఒకేసారి అంగరంగ వైభవంగా జరగడం ఇక్కడి విశేషం. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు భక్తుల నుంచి పూజలందుకోవడానికి లక్ష్మీరంగస్వామి, రంగల్ దర్వేశి ఖాద్రీ సిద్ధం కాగా గని, ఒండుట్ల, ఎల్‌కే తండా, మంచాలకట్ట తదితర గ్రామాల ప్రజలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

మండల పరిధి ఒండుట్ల గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన లక్ష్మీరంగ స్వామి, రంగల్ దర్వేశి ఖాద్రీ స్వామివార్లు పూజలందుకునేందుకు సిద్ధమవుతున్నారు. కొండ పైన ఒకే రాతి గుహలో స్వయంభుగా లక్ష్మీరంగ స్వామి కొలువుదీరారు. కొండ కింద రంగల్ దర్వేశీ ఖాద్రీ స్వామివారు ఉన్నారు. వీరి తిరునాల ఈనెల 13 నుంచి మూడు రోజుల పాటు జరగనుంది. కులమతాలకు అతీతంగా భక్తులు పెద్దఎత్తున తరలి రానుండటంతో అందుకు కావాల్సిన ఏర్పాట్లను నిర్వాహకులు ఇప్పటికే పూర్తి చేశారు.

ఉత్సవాల వివరాలు

ఈ నెల 13 నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. మొదటి రోజు గని గ్రామం నుంచి లక్ష్మీరంగస్వామి వారిని పల్లకీలో మంగళ వాయిద్యాలతో కొండపైకి చేర్చి రాత్రి గరుడ సేవ నిర్వహిస్తారు. కొండ కింద రంగల్ దర్వేశి ఖాద్రీ స్వామికి గని గ్రామం నుంచి గంధాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి దర్గాకు చేర్చుతారు. శుక్రవారం ఉదయం లక్ష్మీసమేత రంగస్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు. మరో వైపు దర్గా వద్ద కిస్తీ వేడుకలు ఘనంగా జరుగుతాయి. చివరిరోజు శనివారం గ్రామోత్సంతో ఉత్సవాలు ముగుస్తాయి. తిరునాల సందర్భంగా మూడు రోజుల పాటు భక్తుల కోసం గని గ్రామంలో సినీ ఆర్కెస్ట్రా, సాంస్కృతిక తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం నంద్యాల, నందికొట్కూరు డిపోల నుంచి ప్రత్యేకంగా బస్సులను నడుపుతారు.

రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

రంగస్వామి, దర్వేశిఖాద్రీ తిరునాల సందర్భంగా రాష్ట్రస్థాయి వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. 15న ఆరు పండ్లలోపు ఎడ్లకు బండలాగుడు పోటీలు జరగనున్నాయి. అలాగే 14న పొట్టేళ్ల, ట్రాక్టర్ రివర్స్ పందేలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

వివాహిత అనుమానాస్పద మృతి


ప్రసన్నలక్ష్మి (ఫైల్)

రాయచూరు రూరల్: అగ్ని సాక్షిగా పెళ్లి చేసుకున్న భార్యను వేధింపులకు గురిచేయడంతో ఆమె అనుమానాస్పద స్థితిలో శవమైంది. రాయచూరు నగరం వాసవినగర్‌లో ఈ సంఘటన జరిగింది. వివరాలు... జిల్లాలోని కల్లూరు మండలం లక్ష్మీపురానికి చెందిన ప్రసన్నలక్ష్మికి జంబన గౌడతో రాయచూరు గీతా మందిరంలో 2008లో కట్నకానుకలు ఇచ్చి ఘనంగా పెళ్లి చేశారు. 25 తులాల బంగారం, రూ 2 లక్షల నగదు ముట్టజెప్పారు. వీరికి 16 ఏళ్ల కూతురు, 14 ఏళ్ల కొడుకు ఉన్నారు. జంబనగౌడ రోజూ మద్యం తాగివచ్చి భార్యను హింసించేవాడు, అత్తమామలు కూడా అతనికి వంతపాడేవారు. పైగా తాను అక్క కూతురిని రెండో పెళ్లి చేసుకుంటాను, నీవు విడాకులు ఇచ్చేయ్ అని ప్రసన్నలక్ష్మిని సతాయించేవాడు. వారి వేధింపుల తట్టుకోలేక ఆమె వారం క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ తరుణంలో ఆమె ఇంట్లో అనుమానాస్పద స్థితిలో ఉరివేసుకొని చనిపోయింది. భర్త, అతని తల్లిదండ్రులే తమ బిడ్డను హత్య చేసి ఆత్మహత్య నాటకం ఆడుతున్నారని విలపించారు. హంతకులను శిక్షించాలని డిమాండ్ చేశారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా భర్తను అరెస్టు చేశారు. అత్తమామలు, ఇద్దరు ఆడపడుచులు పరారీలో ఉన్నారు.

యూత్ పార్లమెంట్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోండి

కర్నూలు కల్చరల్: యూత్ పార్లమెంట్‌లో పాల్గొనడం వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థలతో పాటు రాజ్యాంగానికి సంబంధించిన విషయాల పట్ల యువతకు అవగాహన కలుగుతుందని ఆర్‌యూ వీసీ వి.వి.బసవరావు అన్నారు. భారత ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖతో పాటు ఆర్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, సెయింట్ జోసఫ్ కళాశాల సంయుక్త నిర్వహణలో జరిగే వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం రిజిస్ట్రేషన్లకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం వీసీ ఛాంబర్‌లో ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ.. ఒకే దేశం ఒకే ఎన్నికలు అనే అంశంపై జరిగే యూత్ పార్లమెంట్‌లో పాల్గొనేందుకు 18 నుంచి 25 సంవత్సరాల్లోపు వయసు గల యువత అర్హులన్నారు. ఆసక్తి గల యువత https://mybharath.gov.i n వెబ్‌సైట్‌లో ఈ నెల 16వ తేదీలోగా పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఈ అంశానికి సంబంధించి ఒక నిమిషానికి తక్కువ కాకుండా వీడియోను తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌లో రూపొందించి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థుల వివరాలు ఆయా కళాశాలలతో పాటు విద్యార్థులకు తెలపడం జరుగుతందన్నారు. రెక్టార్ ఎన్‌టీకే నాయక్ పాల్గొన్నారు.